క్లుప్తంగా

నందవరం పోలీస్‌స్టేషన్ తనిఖీ



స్టేషన్ పరిసరాలను పరిశీలిస్తున్న డీఎస్పీ ఉపేంద్రబాబు

నందవరం : స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఎమ్మిగనూరు సబ్ డివిజన్ డీఎస్పీ ఉపేంద్రబాబు వార్షిక తనిఖీ చేపట్టారు. బుధవారం ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు స్టేషన్‌లోని రికార్డులు పరిశీలించారు. సివిల్, క్రిమినల్ కేసుల వివరాలు తెలుసుకున్నారు. కేసుల పరిష్కారం దిశగా స్థానిక ఎస్‌ఐ శ్రీనివాసులు, పోలీసు సిబ్బంది కృషి చేయాలన్నారు. స్టేషన్ పరిధిలో సమస్యాత్మక గ్రామాలపై నిఘా, రాత్రి బస తీరుపై సంతృప్తి వ్యక్తం చేశారు. గ్రామాలలో సీసీ కెమెరాలు, ప్రత్యేక నిఘాపై అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

రూరల్ సీఐగా మధుసూదన్‌రావు



ఎమ్మిగనూరురూరల్: రూరల్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్‌గా బీవీ మధుసూదన్‌రావు బుధవారం బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ సీఐగా పనిచేసిన బీవీ. విక్రంసింహా కర్నూలు వీఆర్‌కు వెళ్లగా, కర్నూల్ సీసీఎస్‌లో పనిచేస్తున్న సీఐ బీవీ. మధుసూదన్‌రావును ఇక్కడికి సీఐగా నియమించారు. ఆయనకు రూరల్ ఎస్‌ఐ శ్రీనివాసులు, సిబ్బంది అభినందనలు తెలిపారు. అనంతరం ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వరరెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు.

వెంకటేష్‌కు బెస్ట్ సర్వీస్ అవార్డు



జిల్లా కలెక్టర్ రంజిత్‌బాషా చేతులమీదుగా అవార్డు అందుకుంటున్న కమతం వెంకటేష్

ఆదోని అర్బన్: పట్టణానికి చెందిన దివ్యాంగుడు కమతం వెంకటేష్ బెస్ట్ సర్వీస్ అవార్డు అందుకున్నారు. 65వ అంతర్జాతీయ విభిన్న ప్రతిభావంతుల దినోత్సవం సందర్భంగా మంగళవారం కర్నూలులోని సునయన ఆడిటోరియంలో జిల్లా కలెక్టర్ రంజిత్‌బాషా ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో కమతం వెంకటేష్‌ను సత్కరించి అవార్డు అందజేశారు.

సుంకులమ్మవ్వ దేవస్థాన ఆవు మృతి



మృతిచెందిన ఆవును పరిశీలిస్తున్న స్థానికులు

ఆదోని టౌన్: పట్టణంలోని ఆర్‌అండ్‌బీ గెస్ట్ హౌస్ సమీపంలో వెలిసిన శ్రీ సుంకులమ్మవ్వ దేవాలయానికి సంబంధించిన ఆవు బుధవారం మహబూబ్ టాకీస్ వద్ద చనిపోయింది. అయితే ఆవుకు గతంలో కుక్క కరిచిందని, అందువల్లే ఆవు మృతిచెందిందని వివేకానంద ట్రస్ట్ సభ్యులు గోపాల్ తెలిపారు. కుక్క కాటు వల్లే ఆవు మృతిచెంది ఉండొచ్చని భావించారు. నాలుగైదు నెలలుగా పట్టణంలో మూడు ఆవులు వివిధ కారణాలచేత చనిపోయాయని, వాటికి దహన సంస్కారాలు చేయడం జరిగిందన్నారు. గోమాతలకు ఏదైనా జబ్బు చేస్తే వెంటనే రక్షించాల్సిన బాధ్యత మనందరిపై ఉందని గోపాల్ తెలిపారు.

వైద్యులు అందుబాటులో ఉండాలి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే బీవీ. జయనాగేశ్వరరెడ్డి

ఎమ్మిగనూరురూరల్: ప్రభుత్వాసుపత్రికి వచ్చే రోగులకు వైద్యులు అందుబాటులో ఉండి వైద్యం అందించాలని ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వరరెడ్డి సూచించారు. బుధవారం స్థానిక ప్రభుత్వాసుపత్రిలో ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ రోగుల పట్ల వైద్యులు నిర్లక్ష్యంగా వ్యవహరించవద్దని, ప్రతి ఒక్కరికీ వైద్యం అందించాలన్నారు. ఆసుపత్రిలో ప్రమాదాలు జరిగినప్పుడు క్రిటికల్ కేర్ సెంటర్ వైద్య సదుపాయాలు అందుబాటులోకి తెస్తున్నట్లు చెప్పారు. సమావేశంలో ప్రభుత్వాసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ సుధ, వైద్యులు పాల్గొన్నారు.

నేడు డీహెచ్‌పీఎస్ జిల్లా మహాసభ

ఎమ్మిగనూరుటౌన్: జిల్లా కేంద్రం కర్నూలులో గురువారం నిర్వహించనున్న దళిత హక్కుల పోరాట సమితి (డీహెచ్‌పీఎస్) జిల్లా మహాసభను విజయవంతం చేయాలని ఆ సంఘం జిల్లా కార్యదర్శి మహేష్, సీపీఐ పట్టణ కార్యదర్శి రంగన్న పిలుపునిచ్చారు. బుధవారం స్థానిక సీపీఐ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడారు. దళిత గిరిజన సబ్‌ప్లాన్, 29 సంక్షేమ పథకాలు, భూమి కొనుగోలుకు నిధుల కేటాయింపులెక్కడ అని ప్రశ్నించారు. ఏఐవైఎఫ్ జిల్లా ఉపాధ్యక్షుడు రాజీవ్, దళిత కుల పోరాట సమితి నాయకులు పెద్దయ్య, మల్లికార్జున పాల్గొన్నారు.

కొత్త భవనాలపై కక్ష !

- గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో సచివాలయాలు, ఆర్బీకేలు, హెల్త్‌క్లినిక్‌ల ఏర్పాటు
- నూతన భవనాల నిర్మాణం
- ప్రభుత్వం మారడంతో ప్రారంభానికి నోచుకోని వైనం
- ప్రారంభానికి ముందే శిథిలమయ్యే ప్రమాదం



గుడికల్‌లో ప్రారంభానికి నోచుకోని ఆర్‌బీకే



గుడికల్ హెల్త్ క్లినిక్



దైవందిన్నె గ్రామంలో ప్రారంభం కాని ప్రభుత్వ భవనాలు

ఎమ్మిగనూరురూరల్: ప్రజల వద్దకే పాలన తీసుకురావలనే ఆశయంతో గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం గ్రామ సచివాలయ వ్యవస్థను ఏర్పాటు చేసింది. ప్రజలు పనుల కోసం పట్టణాలకు వెళ్లకుండా గ్రామాల్లోనే సేవలు అందించేందుకు ఎంతో ప్రతిష్టాత్మకంగా సచివాలయం, రైతు భరోసా కేంద్రం, వైఎస్సార్ విలేజ్ క్లినిక్, డిజిటల్ లైబ్రరీలను ఏర్పాటు చేసింది. వాటికి ప్రాధాన్యతనిచ్చి సొంత భవనాలు కూడా నిర్మించింది. అయితే కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో అవి ప్రారంభానికి నోచుకోవడంలేదు. గత ప్రభుత్వం నిర్మించిందని, ప్రారంభిస్తే వైఎస్సార్‌సీపీ ప్రభుత్వానికి మంచి పేరువస్తుందనే అక్కసుతోనే ప్రారంభించడంలేదనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

కోడ్ రావడంతో వాయిదా..

గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం మండలంలో 23 సచివాలయాలు, 22 రైతు భరోసా కేంద్రాలు, 21 హెల్త్ క్లినిక్స్‌ల నిర్మాణం చేపట్టింది. ఒక్కో సచివాలయానికి రూ. 40 లక్షలు, ఆర్‌బీకేకు రూ. 21.8 లక్షలు, హెల్త్ క్లినిక్స్‌కు రూ.17.80 లక్షలు నిధులు కేటాయించి పనులు పూర్తి చేశారు. ఇందులో కొన్ని భవనాలు ప్రారంభమయ్యాయి. నిర్మాణాలు పూర్తయ్యేనాటికి ఎన్నికల కోడ్ అమలులోకి వచ్చింది. దీంతో మిగతా భవనాలు ప్రారంభానికి నోచుకోలేదు. ఆ తరువాత అధికారంలోకి వచ్చి కూటమి ప్రభుత్వం ఆ భవనాలపై దృష్టి సారించటం లేదు. చాలా పంచాయతీల్లో నూతనంగా నిర్మాణం చేసిన భవనాలు ఖాళీగా దర్శనమిస్తున్నాయి. నిర్మాణాలు పూర్తయినా ప్రారంభం కాకపోవటంతో మెయిటెయిన్స్ లేక భవనాల పరిసరాల్లో అపరిశుభ్రంగా, చెత్తతో దర్శనం ఇస్తున్నాయి. చాల చోట్ల పిచ్చిమొక్కలతో నిండిపోయాయి. . ఇలానే వదిలేస్తే భవనాలు శిథిలావస్థకు చేరుకునే అవకాశం ఉంది.

కొత్త భవనాలు ఉన్నా..
పాత భవనాల్లో విధులు...

గ్రామ సచివాలయం, ఆర్‌బీకే, వైఎస్సార్ విలేజ్ క్లినిక్ ఉద్యోగులు కొత్త భవనాలు ప్రారంభం కాకపోవటంతో వసతులు లేని పాత భవనాలు, పంచాయతీ కార్యాలయాల్లో విధులు నిర్వహిస్తున్నారు. అన్ని వసతులతో నిర్మాణాలు పూర్తయినా భవనాలు నిరూపయోగంగా ఉండటంతో అసౌకర్యాల నడుమే సేవలందిస్తున్నారు. కూటమి ప్రభుత్వం నిరూపయోగంగా ఉన్న భవనాలపై దృష్టి సారించి ఉద్యోగుల ఇబ్బందులను తొలగించి మెరుగైన సేవలు అందించే ఒదుకు కృషి చేయాలని ప్రజలు కోరుతున్నారు.

ఉపయోగంలోకి తీసుకువస్తాం

మండలంలో పూర్తైన సచివాలయం, ఆర్‌బీకె, హెల్త్ క్లినిక్‌లు ఉపయోగంలో ఉన్నాయి. కొన్ని పూర్తయ్యేనాటికి ఎన్నికల కోడ్ రావడంతో ప్రారంభోత్సవాలు వాయిదా పడ్డాయి. కొన్ని చోట్ల పనులు జరగాల్సి ఉంది. అప్పట్లో కోడ్ అమలులో ఉన్నందున అధికారులనే పూర్తయిన భవనాలను ఉపయోగించుకోవాలని అప్పటి కలెక్టర్ ఆదేశాలు ఇచ్చారు. భవనాలు నిరూపయోగంగా ఉన్నవాటి గూరించి ఎమ్మెల్యే దృష్టికి తీసుకువెళ్లి ఉపయోగంలోకి తీసుకువచ్చేల చూస్తాం. – చంద్రశేకర్, డీఈ, పంచాయతీరాజ్‌శాఖ, ఎమ్మిగనూరు



పెసలదిన్నె గ్రామంలో అసంపూర్తిగా ఉన్న సచివాలయం

గృహ నిర్మాణాలు త్వరగా పూర్తి చేయాలి



నాగలదిన్నెలో ఇళ్ల నిర్మాణాలను పరిశీలిస్తున్న ఎంపీడీఓ , హౌసింగ్ డీఈ

నందవరం : గత ప్రభుత్వంలో మంజూరు చేసిన ఇళ్ల నిర్మాణాలను లబ్ధిదారులుత్వరగా పూర్తి చేసుకోవాలని ఎంపీడీఓ పుల్లయ్య, హౌసింగ్ ఇన్‌చార్జ్ డీఈ ప్రసాద్ సూచించారు. బుధవారం మండల పరిధిలోని నాగలదిన్నె, సోమలగూడూరు, పోనకలదిన్నె గ్రామాల్లో హౌసింగ్ లేఅవుట్‌లో ఇళ్ల నిర్మాణాలను పరిశీలించారు. అలాగే సచివాలయాలను తనిఖీ చేశారు. హౌసింగ్ డీఈ మాట్లాడుతూ.. వివిధ దశల్లో ఉన్న ఇళ్ల నిర్మాణాల్లో పురోగతి సాధించాలన్నారు. ఇంజినీరింగ్ అసిస్టెంట్లు లబ్దిదారులకు అవగాహన కల్పించి త్వరగా పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. లబ్ధిదారులకు ఇంటి నిర్మాణ బిల్లులను సకాలంలో చెల్లిస్తామని వివరించారు. థర్డ్ పార్టీ కాంట్రాక్టర్లు ఇళ్ల నిర్మాణాలపై నిర్లక్ష్యం వహిస్తే శాఖ పరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అలాగే నాగలదిన్నెలో వాటర్ ప్లాంట్‌ను తనిఖీ చేసి మరమ్మతులు చేయించాలని పంచాయతీ కార్యదర్శికి ఆదేశించారు. కార్యక్రమంలో ఈఓపీఆర్డీ సందీప్, పంచాయతీ కార్యదర్శి నొసన్న తదితరులు పాల్గొన్నారు.

7న పేరెంట్స్, టీచర్స్ సమావేశం



హెచ్‌ఎంలకు నిర్వహణ నిధులు అందజేస్తున్న ఎంఈఓ మధుసుదన్‌రాజు

ఎమ్మిగనూరుటౌన్: ఈనెల 7న పట్టణంతో పాటు మండలంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో మెగా పేరెంట్స్, టీచర్స్ సమావేశాలను నిర్వహిస్తున్నట్లు ఎంఈఓలు మధుసుదన్‌రాజు, ఆంజినేయులు తెలిపారు. పేరెంట్స్, టీచర్స్ సమావేశాల నిర్వహణకు మండలానికి రూ.3,36,800లు మంజూరు కావడంతో ఆయా నిధులను పాఠశాలల వారీగా బుధవారం స్థానిక ఎంఈఓ కార్యాలయంలో హెచ్‌ఎంలకు అందజేశారు. వారు మాట్లాడుతూ పేరెంట్స్ సమావేశానికి విద్యార్థులందరూ స్కూల్ డ్రెస్‌లో హాజరైయ్యేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. తల్లిదండ్రులను, ప్రజాప్రతినిధులను సమావేశాలకు ఆహ్వానించాలన్నారు. సమావేశానికి హజరయ్యే వారికి మధ్యాహ్న భోజనం తప్పనిసరిగా ఏర్పాటు చేయాలని చెప్పారు.

రేపటి నుంచి రెవెన్యూ గ్రామసభలు

గోనెగండ్ల : రేపటి నుంచి జనవరి 3వ తేదీ వరకు రెవెన్యూ గ్రామసభలు నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ కుమారస్వామి తెలిపారు. బుధవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ రెవెన్యూ గ్రామ సభల్లో భూ సమస్యలను పరిష్కరించుకోవచ్చునని చెప్పారు. 6,7 తేదీల్లో పెద్ద నేలటూర్, 10న గంజిహళ్లి, 11,12 తేదీలలో గోనెగండ్ల, 13న బి.అగ్రహారం, 17న అలువాల, 18న బైలుప్పల, 19న ఐరన్‌బండ, 20న కులుమాల, 21న కున్నూరు, 24న ఎర్రబాడు, 26న పెద్ద మరివీడు, 27న వేముగోడు, 28న తిప్పనూరు, 31న నెరుడుప్పల, జనవరి 2న హెచ్. కైరవాడి, 3న ఎస్. లింగందిన్నె గ్రామంతో సభలు ముగుస్తాయని తెలిపారు. రెవెన్యూ గ్రామ సభలకు ఆయా గ్రామాలకు సంబంధించిన వీఆర్వోలు, విలేజ్ సర్వేయర్లు తప్పనిసరిగా హాజరు కావాలని, రైతుల నుంచి వచ్చే వినతులను స్వీకరించి పరిష్కరించేందుకు కృషి చేయాలని సూచించారు. రెవెన్యూ గ్రామ సభలను రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

కోసిగి: ఈనెల 6వ తేదీ నుంచి జనవరి 8వ తేదీ వరకు గ్రామాల్లో రెవెన్యూ సదస్సు నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ నిత్యానందరాజు, డిప్యూటీ తహసీల్దార్ రుద్రగౌడ తెలిపారు. బుధవారం వారు విలేకరులతో మాట్లాడుతూ 6న కందుకూరు, కామన్‌దొడ్డి, 7న దుద్ది, 10న సాతనూరు, 11న చిర్తనకల్లు, 12న నేలకోసిగి, గౌడగల్లు, 13న డి.బెళగల్, 17న భూంపల్లి, 18న చింతకుంట, 19న దేవరబెట్ట, 20న బి.బొమ్మలపురం, 21న అగసనూరు, 24న జంపాపురం, 26న సజ్జలగుడ్డం, యండపల్లి, 27న ఆర్లబండ, పుంటకుంట, 28న మూగలదొడ్డి, జనవరి 2న కడదొడ్డి, 3న జుమ్మాలదిన్నె, 4న కలువలగుండు, పల్లెపాడు, 7న కోసిగి, పెండేకల్లు, 8న వందగల్లు గ్రామాల్లో నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

విద్యార్థులకు ఎన్‌ఏఎస్ పరీక్షలు



నాలేకల్లు ప్రాథమికోన్నత పాఠశాలలో పరీక్షలు రాస్తున్న విద్యార్థులను పరిశీలిస్తున్న ఎంఈఓ రామమూర్తి

పెద్దకడబూరు : మండల పరిధిలోని నౌలేకల్లు గ్రామంలోని ప్రాథమికోన్నత, పెద్దకడబూరు మెయిన్, ఉన్నత పాఠశాలలో బుధవారం ఎంఈఓ రామమూర్తి ఆధ్వర్యంలో ఎన్‌ఏఎస్(నేషనల్ అచీవ్‌మెంట్ సర్వే)పై విద్యార్థులకు పరీక్ష నిర్వహించారు. ఈ పరీక్షలలో నౌలేకల్లు ప్రాథమికోన్నత పాఠశాల 3వ తరగతి నుంచి 24మంది విద్యార్థులు, పెద్దకడబూరు మెయిన్ పాఠశాల 3వ తరగతి నుంచి 26 విద్యార్థులు, ఉన్నత పాఠశాల 9వ తరగతి నుంచి 30మంది విద్యార్థులు పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ విద్యార్థుల అభ్యసన సామర్థ్యాలను అంచనా వేయడానికి, అభ్యసన సామర్థ్యాలను మెరుగు పరచడానికి, గుణాత్మక విద్యను అందించడానికి ఈ సర్వే ఎంతో ఉపయోగపడుతుందన్నారు.

అడ్డంగా వాహనాలు.. రోగులకు ఇబ్బందులు



వాహనాలు అడ్డంగా ఉండటంతో దూరంగా నిలిచిన అంబులెన్స్

కోసిగి: మండల కేంద్రం కోసిగి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ముందు భాగంలో ప్రైవేట్ వాహనాలు నిలుపుతుండటంతో పేషంట్లు రాకపోకలకు ఇబ్బందులు పడుతున్నారు. హాస్పిటల్‌కి వివిధ పనుల నిమిత్తం వచ్చిన వారు ఆటోలు, బైక్‌లు హాస్పిటల్ లోనికి వెళ్లే దారిలో అడ్డుగా నిలిపి వేస్తున్నారు. దీంతో అత్యవసర చికిత్స కోసం వచ్చిన గర్భిణులు, రోగులు, యాక్సిడెంట్ బాధితులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ పరిస్థితిల్లో అంబులెన్స్ కూడా లోపలికి రావడానికి వీలుకలుగడం లేదు. హాస్పిటల్‌లో వాహనాల పార్కింగ్ ఏర్పాటు చేయాలని, దారికి అడ్డుగా వాహనాలు పెట్టిన వారిపై చర్యలు తీసుకోవాలని స్థానిక ప్రజలు కోరారు.

150 మందికి ఉచిత కంటి పరీక్షలు

ఎమ్మిగనూరుటౌన్: పట్టణంలోని శ్రీవెంకటేశ్వర కంటి వైద్య శాల రెండవ వార్షికోత్సవం సందర్భంగా బుధవారం ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. శిబిరంలో 150 మందికి కంటి వైద్య నిపుణుడు నాగవంశీకృష్ణ కంటి పరీక్షలు చేశారు. వారిలో 42 మందికి శస్త్ర చికిత్సలు చేయనున్నట్లు ఆయన తెలిపారు.

పారిశుద్ధ్యంపై నిర్లక్ష్యం తగదు



పారిశుద్ధ్య కార్మికుడికి సూచనలిస్తున్న కమిషనర్

ఎమ్మిగనూరుటౌన్: పట్టణంలో పారిశుద్ధ్య పనుల్లో సిబ్బంది నిర్లక్ష్యం వహించవద్దని మున్సిపల్ కమిషనర్ గంగిరెడ్డి సూచించారు. బుధవారం పట్టణంలోని సోమప్ప సర్కిల్ ప్రాంతంలో పారిశుద్ధ్య పనులను పరిశీలించారు. వీధుల్లో అపరిశుభ్రత లేకుండా పనులు చేయాలన్నారు. పట్టణ వాసులు పారిశుద్ధ్యానికి సహకరించాలని కోరారు.

మహిళల భద్రత మనందరి బాధ్యత

గోనెగండ్ల : మహిళలు, బాలబాలికల భద్రత మనందరి బాధ్యత అని సీఐ గంగాధర్ అన్నారు. బుధవారం స్థానిక పోలీస్ స్టేషన్‌లో విలేకరులతో ఆయన మాట్లాడుతూ లైంగిక నేరాల నుంచి పిల్లలను రక్షించాలన్నారు. బాల్య వివాహాలు, బాలల భిక్షాటనను పూర్తిగా నిర్మూలించాలన్నారు. బాలికలకు గుడ్ టచ్, బ్యాడ్ టచ్ గురించి అవగాహన కల్పించాల్సిన అవసరం మనందరిపై ఉందన్నారు. అలాగే మహిళలు, చిన్న పిల్లలపై జరుగుతున్న దాడులను అరికట్టాలన్నారు. తల్లిదండ్రులు పిల్లల ప్రవర్తనను గమనిస్తూ ఉండాలన్నారు. బాల బాలికల రక్షణ కోసం చైల్డ్‌లైన్ 1098, హెల్ప్‌లైన్ 181, పోలీస్ డయల్ 100కు సమాచారం అందించాలని తెలిపారు.

క్రీడామైదానంలో చెత్తాచెదారం



ఆదోని అర్బన్: పట్టణంలోని మున్సిపల్ క్రీడా మైదానం చెత్తా చెదారం, రాళ్లు, రప్పలతో నిండిపోయింది. మైదానాన్ని శుభ్రం చేయడంపై మున్సిపల్ అధికారులు పట్టించుకోవడం లేదు. క్రీడాకారులు, వాకింగ్ చేయడానికి, ఆటలు ఆడేందుకు ఉదయం 6 గంటల నుంచి వస్తున్నారు. మైదానంలో చెత్త, చెదారం, రాళ్లు, రప్పలు ఉండడం, దుర్వాసన వెదజల్లడంతో తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. అంతేగాకుండా రాత్రివేళలో అసాంఘిక కార్యకలాపాలు, మద్యం సేవించడం వంటివి జరుగుతున్నాయని స్థానికులు చెబుతున్నారు. మైదానంలోనే రెండు ఉన్నత పాఠశాలలు ఉండడంతో విద్యార్థులు క్రీడలు ఆడేందుకు కూడా తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని ఉపాధ్యాయులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మున్సిపల్ అధికారులు క్రీడా మైదానంలోని చెత్తాచెదారం, రాళ్లు, రప్పలను తొలగించాలని కోరుతున్నారు.

అధిక సాంద్రత పద్ధతి లాభదాయకం



పత్తిసాగుపై అవగాహన కల్పిస్తున్న అధికారులు

ఆదోని సెంట్రల్: అధిక సాంద్రత పత్తి సాగు రైతులకు లాభదాయకమని కేవికే శాస్త్రవేత్త రాఘవేంద్ర తెలిపారు. బుధవారం ఢణాపురం గ్రామంలో రిలయన్స్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆర్డిప్ స్వచ్ఛంద సంస్థ రైతు క్షేత్ర దినోత్సవం నిర్వహించారు. వారు మాట్లాడుతూ అధిక సాంద్రత వలన పెట్టుబడి ఖర్చులు తగ్గుతాయన్నారు. రిలయన్స్ వారు ఆర్డిప్ సంస్థ ద్వారా 50 శాతం రాయితీ కింద విత్తనాలను పంపిణీ చేస్తారని చెప్పారు. పత్తి సాగు చేస్తున్న రైతులకు సాగుపై అవగాహన కల్పించారు. రిలయన్స్ ఫౌండేషన్ డీపీఓ సర్వేశ్వరరెడ్డి, ఆర్డిప్ సంస్థ అధ్యక్షుడు భాస్కర్ మాట్లాడుతూ జిల్లాలో 250 ఎకరాలలో హైడెన్సిటీ పత్తి విత్తనాలను సబ్సిడీ కింద పంపిణీ చేసినట్లు తెలిపారు. ఇంకా 8 మండలాల్లో హైడెన్సిటీ విత్తనాలు వేసే విధంగా రైతులను ప్రోత్సహిస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో ఏడీఏ అరుణకుమారి, ప్రాజెక్టు కోఆర్డినేటర్ అఫ్రిన్, పవన్ తదితరులు పాల్గొన్నారు.

వేతనాలు పెంచాలి



మాట్లాడుతున్న అంగన్‌వాడీ వర్కర్స్ ,హెల్పర్స్ యూనియన్ కార్యదర్శి గోవర్ధనమ్మ

ఎమ్మిగనూరుటౌన్: అంగన్‌వాడీ సిబ్బంది వేతనాలు పెంచాలని అంగన్‌వాడీ వర్కర్స్,హెల్పర్స్ యూనియన్ ప్రాజెక్ట్ కార్యదర్శి గోవర్ధనమ్మ, సీఐటీయూ మండల నాయకులు రాముడు, హనుమంతు డిమాండ్ చేశారు. బుధవారం స్థానిక సీఐటీయూ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడారు. అంగన్‌వాడీలకు కనీస వేతనం రూ.26వేలు ఇవ్వాలని, గ్రాట్యుటీ, పెన్షన్ సౌకర్యం కల్పించాలన్నారు. సమావేశంలో ఆ సంఘ నాయకులు శైలజ, గ్రేసమ్మ, అరుణ, భాగ్యమ్మ, నీరజ, శారద తదితరులు పాల్గొన్నారు.

మాజీ ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు



అర్జున్‌కు నగదు అందజేస్తున్న మాజీ ఎమ్మెల్యే

ఆదోని టౌన్: తమ కుమారుడు వాల్మీకి అర్జున్‌కు వికలాంగ పింఛన్ మంజూరయ్యేలా కృషి చేసిన ఆదోని మాజీ ఎమ్మెల్యే సాయిప్రసాద్‌రెడ్డికి బాలుడి తల్లిదండ్రులు కృతజ్ఞతలు తెలిపారు. గతేడాది వాల్మీకి నగర్‌లో నిర్వహించిన 'గడప గడపకు మన ప్రభుత్వం' కార్యక్రమంలో తమ కుమారుడు అర్జున్‌కు పింఛన్ మంజూరు చేయించాలని వారి తల్లిదండ్రులు కోరారు. దీంతో పింఛన్ మంజూరు చేయాలని అధికారులను సాయిప్రసాద్‌రెడ్డి ఆదేశించారు. దీంతో అర్జున్‌కు పింఛన్ మంజూరు కాగా ఈనెల1వ తేదీన నగదు అందుకున్నాడు. దీంతో బుధవారం స్థానిక మాజీ ఎమ్మెల్యే స్వగృహంలో సాయిప్రసాద్‌రెడ్డిని కలిసి వారు కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ సందర్భంగా వికలాంగుడు వాల్మీకి అర్జున్‌కు తనవంతుగా మాజీ ఎమ్మెల్యే రూ.5 వేలు సాయం అందజేశారు.

చిరుజల్లులతో రైతులు పరేషాన్



బదినేహాల్ వద్ద మిరపపై పట్టలను కప్పకున్న రైతులు

కౌతాళం: తుపాన్ కారణంగా గత రెండు రోజుల నుంచి ఆకాశం మబ్బులు కమ్మి మేఘామృత్తం కావడంతో పాటు చిరుజల్లులతో కూడిన వర్షం పడుతుండడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికే వరి కోతలు కోసి పంటను పొలాల్లోనే ఆరబెట్టుకుంటున్నారు. మిరప పంట కోత కోసి ఆర బెట్టుకుంటున్న రైతుల పరిస్థితి చాల దారుణంగా మారింది. పంటలను కాపాడుకోవడానికి నానా పాట్లు పడుతున్నారు. చేతికొచ్చిన పంటను అమ్ముకోవడానికి వీలు లేకుండా తుపాన్ ప్రభావం పడడంతో పంటపై తేమ శాతం పెరిగిపోతున్నదని రైతులు ఆవేదన చెందుతున్నారు.



కౌతాళంలో వరి ధాన్యం తడవకుండా పట్ట కప్పిన దృశ్యం

సమన్వయంతో లక్ష్యాలను పూర్తి చేయండి



మాట్లాడుతున్న డ్వామా పీడీ వెంకటరమణయ్య

ఆదోని రూరల్: ఉపాధిహామీ పథకంలో పని చేస్తున్న ప్రతిఒక్కరూ సమన్వయంతో పని చేసి టార్గెట్‌లను పూర్తి చేయాలని డ్వామా పీడీ వెంకటరమణయ్య సూచించారు. బుధవారం స్థానిక ఉపాధిహామీ కార్యాలయంలో ఆదోని మండలస్థాయి కోర్ కమిటీ జరిగింది. ఆయన మాట్లాడుతూ.. జిల్లాలో ఆదోని మండలం టార్గెట్‌ను రీచ్ కావడంలో వెనుకబడి ఉందని, ఈ ఏడాది ఆర్థిక సంవత్సరానికి గానూ కూలీలకు రూ.7.43 లక్షలు టార్గెట్‌ను ఇవ్వగా, ఇప్పటివరకు కేవలం రూ.3.76 లక్షలు మాత్రమే పూర్తి చేశారన్నారు. మిగతా 50 శాతం టార్గెట్‌ను పూర్తి చేసేందుకు ప్రతిఒక్కరూ బాధ్యతగా పనిచేయాలన్నారు. గ్రామాల్లో క్షేత్రస్థాయిలో ఉన్న పాత ఫీల్డ్ అసిస్టెంట్లు, ప్రస్తుత ప్రభుత్వంలో నియమించిన సీజనల్ మేటీలతో కలిసి టార్గెట్‌ను పూర్తి చేయాలని సూచించారు. కార్యక్రమంలో ఏపీడీ లోకేశ్వర్, ఎంపీడీఓ రాజేంద్రప్రసాద్, ఇన్‌చార్జ్ ఏపీఓ ఖాలిక్‌బాషా పాల్గొన్నారు.